క్లుప్తంగా

కౌలు కార్డు తప్పనిసరి

దొర్నిపాడు: ప్రభుత్వ పథకాలు పొందాలంటే కౌలు రైతులకు కౌలు కార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని డబ్ల్యూ కొత్తపల్లె, చాకరాజువేముల గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాను అందుబాటులో ఉంచామని, పేర్లు లేకపోతే వీఏఎలకు వివరాలు అందజేయాలన్నారు. మట్టినమూనాల ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కేసులే

శిరివెళ్ల: పాఠశాలలు, కళాశాలకు వంద మీటర్ల పరిధిలో ఎవరైనా మత్తు పదార్థాలను అమ్మితే కేసులు నమోదు చేస్తామని సీఐ దస్తగిరి బాబు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం శిరివెళ్లలో పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సిగరెట్లు, ఖైనీ, లిక్కర్, సారా, గంజాయి, బీడీ, సిగరెట్లు అమ్మరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

ఉయ్యాలవాడ : ప్రతి రైతులు భూ సార పరీక్షల ఆధారంగా పంటలకు రసాయనిక ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఆర్.పాంపల్లె, కొందుపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు పై గ్రామాల్లో రైతులతో కలిసి బీడు భూములను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయింది, నెల రోజులు గడుస్తున్నా రైతులు ఎలాంటి పంటలు సాగు చేయకపోవడంపై సమీక్షించారు. రబీ సీజన్ వచ్చే వరకు పొలాలను ఖాళీగా ఉంచకుండా చిరు ధాన్యాలు వంటి పంటలు సాగు చేస్తే ఖర్చు తక్కువ దిగుబడులు 60 రోజుల నుంచి 90 రోజుల వ్యవధిలోనే చేతికి అందుతాయి. దీంతో రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

నంద్యాల(వ్యవసాయం): కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల్లో తీసుకొస్తున్న ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దామని బ్యాంక్ ఉద్యోగులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం రీజినల్ ఆఫీస్‌లో గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నాయకులు గుడిపల్లి సుజిత్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ప్రైవేట్ పెట్టుబడులు సరికాదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఒకే దేశం ఒకే గ్రామీణ బ్యాంక్ (ఎస్ఆర్‌బీఐ) అనే నినాదం అనే అంశాలతో సమ్మెలో పాల్గొంటున్నామని ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమ్మెలో గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల నాయకులు కె.కృష్ణవేణి, రవితేజ రెడ్డి, రమేశ్, సీఐటీయూ నాయకులు నాగరాజు, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రుద్రవరం: మండల పరిధిలోని లాలాయిపేట వద్ద ఆరుగురు పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. గత కొద్ది రోజులుగా నక్కల దిన్నె గ్రామ సమీపంలో పేకాట సాగుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం దాడి చేశారు. మందలూరుకు చెందిన యల్లాలప్ప, జాన్, జంబులదిన్నెకు చెందిన ధర్మతేజ, హరీష్, వెంకటరాముడు, చింతకుంట్లకు చెందిన రహీం అనే ఆరుగురు నిందితులను పట్టుకొని వారి నుంచి రూ.9,980 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో జియారత్



స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో మౌలాలి స్వామి జియారత్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం ముగిసిన మూడో రోజు స్వామి వారి జియారత్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. ఇందులో భాగంగానే బుధవారం చావిడి నిర్వాహకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి కొలువు దీర్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తాదులు తరలి వచ్చి ఫాతెహాలు సమర్పించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వామికి ఫాతెహాలు చదివించారు. చావిడి వద్దకు వచ్చిన భక్తాదులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

గ్రామాల అభివృద్ధిపై సమీక్ష

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి, పురోగతి సూచిక వర్షన్ 2.0పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలకు కావాల్సిన అత్యవసర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటయ్య, ఫణీకృష్ణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.





గురుపౌర్ణమికి సిద్ధమైన నాగులకుంట సాయిబాబా గుడి, విద్యుత్ దీపాలంకరణలో బొమ్మల సత్రం షిర్డీ సాయిబాబా ఆలయం



బొమ్మల సత్రంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

గురుపౌర్ణమికి ముస్తాబు

గురుపౌర్ణమి వేడుకలకు సాయి బాబా ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నంద్యాల పట్టణ పరిధిలో నాగులకుంట రోడ్డులో , బొమ్మలసత్రంలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఆలయాల్లో స్వామి వారికి గురువారం ఉదయం కాగడ హారతి, విష్ణు సహస్ర నామార్చన, పల్లకీ సేవ, అభిషేకం, సాయంత్రం పూలంగిసేవ, సంధ్యాహారతి, విష్ణుపారాయణం నిర్వహిస్తారు. సాయంత్రం అశేష భక్తజనం మధ్య గ్రామోత్సవ కార్యక్రమం చేపడుతారు. అయ్యలూరిమెట్ట, జంబులాపరమేశ్వరి దేవాలయం, విశ్వనగర్ ప్రాంతాల్లోని బాబా ఆలయాల్లో కూడా నేడు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

–నంద్యాల(వ్యవసాయం)

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్



దొర్నిపాడులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు

దొర్నిపాడు: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వా లని నినదించారు. ఈ అంశంపై ఆల్‌ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్, అండ్ ఫెడరేషన్ పిలుపు బుధవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో అంగన్‌వాడీలు ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. దొర్నిపాడులో జరిగిన ఆందోళనలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉయలక్ష్మి, విజయలక్ష్మి, వెంకట సుబ్బమ్మ, మాధవీ మాట్లాడుతూ మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇవ్వడంతో పాటు వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. రైల్వే, విద్యుత్, స్టీల్, బ్యాంకు, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ రంగాల్లో ప్రైవేటీకరణ విధానాలను ఆపడంతో పాటు బాలసంజీవని యాప్‌లో మార్పులు తీసుకరావాలన్నారు. అలాగే కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలతో పాటు ఆశావర్కర్లు సైతం తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ సుభద్రకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలసరి వేత నం కనీసం రూ. 26 వేలకు పెంచాలని మండల అంగన్‌వాడీ అధ్యక్షురాలు రాజేశ్వరమ్మ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన అనంతరం తహసీల్దార్ సువర్ణాదేవి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వర్తించేలా అంగన్‌వాడీ సెంటర్లకు సెలువులు ఇవ్వాలి, బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని, అంగన్‌వాడీల ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

చాగలమర్రి: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయ కార్యకర్తలు తమ డిమాండ్లపై బుధవారం తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సంజీవమ్మ, రజని, సువర్ణ, నాగలక్ష్మీ, రెహెన, అనురాధ, రాణి, శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలి

- బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శులను గుర్తించాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్వర్ణాంధ్ర-2047 విజన్ అమలులో భాగంగా వివిధ రంగాల్లో జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని కలెక్టర్ విజయకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్వర్ణాంధ్ర-2047 నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్, జీరో పావర్టీ- పీ4 మార్గదర్శి - బంగారు కుటుంబం మోడల్ సర్వేపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధి కోసం విద్య, వ్యవసాయం, పాడిపరిశ్రమతో పాటు వివిధ రంగాల్లో దృష్టి సారించి తీసుకోవాల్సిన చర్యలపై ఎమినెంట్ ప్రతినిధులు సమావేశంలో చర్చించి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యమై గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు చేయి చేయి కలిపి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పేదలను బంగారు కుటుంబంగా భావించి వారికి చేయూతనిచ్చే వారిని మార్గదర్శులుగా గుర్తించాలన్నారు. ఆగస్టు 15లోగా ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వం కార్యాచరణ నిర్దేశించిందన్నారు. మన జిల్లాలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు వారి ప్రాంతాల్లో ఉండే వనరుల ద్వారా ఎలా సంపాద సృష్టించాలో వివరించారు. కార్యక్రమంలో సీపీఓ వేణుగోపాల్, ఆర్‌డీఓలు విశ్వనాథ్, నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పక్కా గృహాలకు 682 అర్జీలు

శిరివెళ్ల: మండలంలో పక్కా గృహాలకు కొత్తగా 682 అర్జీలు అందాయని హౌసింగ్ ఏఈ యోగేశ్వరావు బుధవారం తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అర్జీలను సమగ్రంగా పరిశీలన చేశారన్నారు. శిరివెళ్లలో 86, గోవిందపల్లె 67, చెన్నూరు 59, గంగవరం 12, బోయలకుంట్ల 95 అర్జీలు అందాయన్నారు. మహదేవపురంలో 30, గుండంపాడు 43, కామినేనిపల్లె 4, కోటపాడు 38, యర్రగుంట్ల 155, వనికినిదిన్నె 24, జీనేపల్లెలో 7 చొప్పున అర్జీలు అందాయన్నారు. గృహాల మంజూరు కోసం అర్జీలను ప్రభుత్వానికి పంపామన్నారు.

అన్నదాత సుఖీభవ జాబితా విడుదల

శిరివెళ్ల: అన్నదాత సుఖీభవ సంబంధించి అర్హుల జాబితా విడుదలైనట్లు ఏఓ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలోతెలిపారు. జాబితాలను ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఉంచామని, అందులో పేర్లు లేని వారు ఈ నెల 13 లోగా సేవా కేంద్రాల్లో అవసరమయిన సర్టిఫికెట్లు సమర్పించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

సచివాలయాల సిబ్బంది బదిలీలు

శిరివెళ్ల: మండలంలో గ్రామ సచివాలయాల సిబ్బంది బదిలీలు భారీగా జరిగాయి. మండలంలో 16 గ్రామ సచివాలయాల్లో మొత్తం 128 మంది సిబ్బంది ఉంటే అందులో 75 శాతం మంది బదిలీ అయ్యారు. 5 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు సొంత మండలానికి కాకుండా వేరే మండలానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు 2 రోజుల నుంచి పాత, కొత్త సిబ్బంది రిలీవ్, జాయిన్ ప్రక్రియ జరుగుతుంది.

11, 12న యూదుల పండుగ సభలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని క్రాంతినగర్ సమీపంలో ఉన్న ఇండియన్ పెంతెకోస్త్ చర్చి ఆవరణలో ఈనెల 11,12న యూదుల పండుగల సువార్త సభలు జరగనున్నాయి. ఈ విషయాన్ని బుధవారం ఆ చర్చి పాస్టర్ జనుమల జాన్‌బెన్ని ప్రకటనలో పేర్కొన్నారు.

మౌలాలి స్వామి జార్తలు

గోస్పాడు: మొహర్రం పండుగ ముగియడంతో బుధవారం మౌలాలి స్వామి జార్తలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి స్వామిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సుదాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

చాపిరేవులలో అసెస్మెంట్ సర్వే

నంద్యాల(అర్బన్): మండలంలోని చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ కాలేజీ సోషల్ ప్రీవెంటివ్ మెడిసిన్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌సీడీ 3.0 క్వాలిటీ అసెస్మెంట్ సర్వే నిర్వహించారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావునాయక్, హెచ్‌ఓడీ విజయకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ హేమలత, జహనాబీ పర్యవేక్షణలో గ్రామంలో ఇంటింటికి తిరిగి అధిక రక్తపోటు, మధుమేహం, ఇతర సంబంధిత వ్యాధులపై సర్వే చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ షహలాం, మెడికల్ కాలేజీ ట్యూటర్స్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన లయన్స్ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. బుధవారం స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవికృష్ణ, ఏవీఆర్ ప్రసాద్ ఈ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది సోమేశుల నాగరాజు, కార్యదర్శిగా తాతిరెడ్డి భాస్కరరెడ్డి, కోశాధికారిగా అమిదేల జనార్దన్, ఉపాధ్యక్షులుగా కూర ప్రసాద్, పోసిన సుబ్బారావు, షావలి రెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఇమ్మడి వెంకట రామకృష్ణుడు, మామిళ్ల నాగరాజు, అరవేటి రాఘవేంద్రను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ రానున్న సంవత్సర కాలంలో లయన్స్ క్లబ్ తరపున సామాజిక సేవా కార్యక్రమాలు, దివ్యాంగులకు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు, పర్యావరణ, విద్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిల్ల నాగరాజు, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఆడిటర్ గోపాల్, డాక్టర్ రవికృష్ణ, ఏవీఆర్ ప్రసాద్, ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం
- కర్నూలు ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన ధార మార్కు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యేసేబు

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామ సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోడిగనూరు గ్రామానికి చెందిన యేసేబు అతని బంధువు చాపాడు మండలం, భద్రిపల్లె గ్రామానికి చెందిన ధార మార్కుతో కలిసి బైక్‌పై చాగలమర్రికి వెళ్తుండగా మార్గం మధ్యలోని శెట్టివీడు గ్రామ సమీపంలో.. చాగలమర్రి నుంచి చెంచుగూడెం వెళ్తున్న రవితేజ బైక్‌పై ఎదురుగా రావడంతో వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో యేసేబు, ధార మార్కు తీవ్రంగా గాయపడ్డారు. రవితేజకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించారు. యేసేబు ఎడమ కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కావడం, ధార మార్కు కణతకు తీవ్ర గాయం కావడంతో ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. స్వల్పంగా గాయపడిన రవితేజ కేరళ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

యూఎల్‌బీల ఎంపికలో నంద్యాలపై వివక్ష

- అన్యాయంపై మంత్రికి మునిసిపల్ చైర్‌పర్సన్ లేఖ



మంత్రికి రాసిన లేఖను చూపుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): యూఎల్‌బీ(అర్బన్ లోకల్ బాడీ)లను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మున్సిపాలిటీలను ఎంపిక చేసింది. ఇందులోని కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలకు ప్రాతినిధ్యం వహించే మున్సిపల్ చైర్మన్లు, చైర్‌పర్సన్లకు ప్రజలకు మెరుగైన పాలన అందించడం, లోకల్‌బాడీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించనుంది. అయితే, ఈ యూఎల్‌బీలను ఎంపిక చేయడంలో కూటమి ప్రభుత్వం వివక్షత చూపించిందని నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ ఆరోపించారు. ఈ అంశంపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు లేఖ రాసినట్లు తెలిపారు. బుధవారం ఆ వివరాలు విలేకరులకు తెలియజేశారు. ఈనెల 3, 4 తేదీల్లో హరియాణా రాష్ట్రంలోని గురుగ్రాంలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు జరిగిందని, ఇందులో పాల్గొనేందుకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు చోటు కల్పించి నంద్యాల జిల్లాను మాత్రం ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఇలా వివక్ష చూపడం మంచిది కాదని, రాజకీయాలకు అతీతంగా స్థానిక సంస్థల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి నారాయణకు రాసిన లేఖలో పేర్కొనట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణ సమగ్రాభివృద్ధితో పాటు ప్రజలకు సంబంధించిన అంశాలపై నిరంతరం పోరాటాలు చేస్తామని నూతనంగా ఎన్నికైన సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ నాయకులు 31 మంది కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుందూ, మద్దిలేరువాగు, చామకాల్వ మధ్యలో నిలుపుదల చేసిన వరద రక్షణ గోడను త్వరగా పూర్తి చేయాలని, నంద్యాల పట్టణం ముంపునకు గురి కాకుండా చూడాలన్నారు.

ఉపాధిలో అక్రమాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

గోస్పాడు: ఉపాధి పనుల్లో అక్రమాలకు చోటు ఇవ్వకుండా, రాజకీయాలకు అతీతంగా కూలీలకు పనులు కల్పించాలని ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనుల పురోగతిని సమావేశంలో తెలియజేశారు. తెలియజేశారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు జోక్యం చేసుకుని గ్రామాల్లో ఉపాధి పనులను ఒక వర్గం వారికే కల్పిస్తున్నారని, పనులకు వెళ్లని వారికి కూడా హాజరు వేస్తున్నారన్నారు. ఈ అవకతవకలపై ఎందుకు దృష్టి సారించడం లేదని ఎంపీడీఓ అమానుల్లా, ఉపాధి ఏపీఓ గంగన్నను వారు ప్రశ్నించారు. అలాగే వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన ఎరువు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఉపమండలాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు, ఈఓఆర్డీ నాగ అనసూయ, ఎంఈఓ అబ్దుల్ కరీం, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



సాయిబాబా ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రా రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(వ్యవసాయం): గురుపౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం స్థానిక బొమ్మలసత్రంలో వెలసిన శ్రీషిర్డీ సాయిబాబ ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, దాల్‌మిల్ అమీర్‌లు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శిల్పారవి, ఇషాక్ బాషాలు మాట్లాడుతూ షిర్డీలో నిర్మించిన ఆలయానికి ప్రతిరూపంగా బొమ్మల సత్రంలో ఆలయం నిర్మించడం అద్భుతం అన్నారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు బాబా ఆశీస్సులు మెండుగా ఉండాలని, అందరు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని మొక్కకున్నట్లు తెలిపారు. అనంతరం వేద పండితులు వారిని ఆశీర్వాదించి ప్రసాదలు, బాబాప్రతిమలు అందజేశారు. కార్యక్రమంలో దేశం సుధాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఆర్టీసీ భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, మధుమోహన్‌రెడ్డి, అనంతలక్ష్మి, రమేష్, సురేష్, దస్తగిరి, షరీఫ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం

శిరివెళ్ల: కార్మికులకు నష్టం కలిగించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం వివిధ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె విజయవంతమైంది. శిరివెళ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెన్న బాల వెంకట్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జయశ్రీకి అందచేశారు. ఽ

రుద్రవరం: లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ మండల కేంద్రం రుద్రవరంలో వివిధ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రా మచంద్రుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికులు, రైతుల గోడు పట్టడం లేదన్నారు.

గోస్పాడు: కార్మికులు, రైతులు, ఉద్యోగులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన గోస్పాడులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవణకుమారి, చెన్నయ్య మాట్లాడారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్ జైలులో భోజనం రుచి చూస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో జీవించటానికి ప్రయత్నించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు. అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వారు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మానసిక ఆరోగ్య విభాగం తనిఖీ

నంద్యాల(వ్యవసాయం): శాంతిరాం మెడికల్ కాలేజ్‌లోని మానసిక వికలాంగుల విభాగాన్ని బుధవారం సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి, లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మానోనియా కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ మానసిక వికలాంగులకు న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్ఎంఎం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వార్డులోని మానసిక వికలాంగులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో శాంతిరాం హాస్పిటల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్ పాల్గొన్నారు.

- నంద్యాల సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి లీలావెంకట శేషాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, ఖైదీల కేసులు వివరాలు, వారి ఆరోగ్య విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వృద్ధ ఖైదీలకు ఉచితంగా బెయిల్ మంజూరుకు కృషి చేస్తాం అన్నారు. జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్‌రెడ్డి, న్యాయవాది నాయక్, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న అధికారులు

దొర్నిపాడు: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఎస్ఎస్‌జీ సర్వే బృందం వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, పరిశుభ్రతపై సర్వే నిర్వహించారు. ఆమె తడి, పొడి, ఘన వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయాలు, పాఠశాలలు, వెల్‌నెస్ సెంటర్లు, పశువైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ర్యాంకుల ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ వారు దేశవ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామిరెడ్డి, ఈఓపీఆర్డీ శివప్రసాద్, జిల్లా కన్సల్టెంట్ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఓబులేసు, ఎంఆర్సీ జర్మియా ఎఎస్ సర్వే సిబ్బంది వెంకట సుబ్బయ్య, రవి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

నంద్యాల(అర్బన్): గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం పంచాయతీ పురోగతి సూచిక వర్షన్ 2.0 ఎఫ్‌వై 2023-24 శిక్షణ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో పాటు ఏఎస్ఎంలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శివనాగజ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి బుధవారం వివిధ శాఖల ఉద్యోగులకు పంచాయతీ పురోగతిపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి పాటు పడాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

CHANGE OF NAME

I, Sree Lakshmi Daughter of Army No JC-442031P Rank Sub Name M.Lakshmi Narasimhulu Vill Allagadda Post Allagadda Teh Allagadda Dist Kurnool Now Present Distt Nandyal State Andhra Pradesh Pin 518543 do here by solemnly affirm and declare as under. That I have changed my name from Sree Lakshmi to Mangali Sree Lakshmi due to change of surname.

CHANGE OF NAME

I, M.Naga Bharath Son of Army No JC - 442031P Rank Sub Name M.Lakshmi Narasimhulu Vill Allagadda Post Allagadda Teh Allagadda Dist Kurnool Now Present Distt Nandyal State Andhra Pradesh Pin 518543 do here by solemnly affirm and declare as under. That I have changed my name from M.Naga Bharath to Mangali Naga Bharath due to change of surname.